సాక్షి ప్రకాశం

గురువారం । 5 । జనవరి । 2023



అంధులకు అండగా ఉంటాం

అంధులకు అండగా ఉంటామని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. - 8లో..



కటకటాల్లోకి నకిలీ పోలీస్

కోయంబత్తూరుకు చెందిన బంగారం వ్యాపారిని పోలీసు పేరుతో బురిడీ కొట్టించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
29 /21

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

నేడు థెరీసమ్మ సంస్మరణ సభ

● మార్కాపురానికి మంత్రుల రాక



ఏర్పాట్లపై సీఐతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

మార్కాపురం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తల్లి, జార్జి విద్యా సంస్థల చైర్‌పర్సన్ చెరుకూరి థెరీసమ్మ సంస్మరణ సభ గురువారం స్థానిక జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో జరగనుంది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. దీంతో మార్కాపురం సీఐ భీమానాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.

8 నుంచి రాష్ట్ర స్థాయి ఆర్ఎస్‌వీజే క్రికెట్ పోటీలు

సీఎస్‌పురం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్ఎస్‌వీజే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ఈ నెల 8 నుంచి సీఎస్‌పురంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.లక్ష, షీల్డ్, రూ.50 వేలు, రూ.30 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతీ మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్‌ద సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్‌లకు బహుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 6వ తేదీలోపు ఫోన్‌పే నంబర్ 7095287135 కు రూ.2 వేల ప్రవేశ రుసుం చెల్లించి తమ జట్టు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు బి.సాయి రవి సెల్:9063357135, పి.నాగార్జున సెల్:7674020675, ఎం సత్యం సెల్:7410522666 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చిన్న పిల్లల చేత పనులు చేయిస్తే కఠిన చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న కార్మిక శాఖ అధికారులు

ఒంగోలు టౌన్: దుకాణాల యజమానులు నిబంధనలకు వ్యతిరేకంగా చిన్నపిల్లల చేత పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎస్.శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం ఆయన నెల్లూరు బస్టాండ్ సెంటర్, రాంనగర్, భాగ్యనగర్, గాంధీరోడ్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక మెకానిక్ షాపులో పని చేస్తున్న బాలకార్మికుడిని గుర్తించి సదరు దుకాణ యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో సహాయ కార్మిక కమిషనర్ కె.పవన్ కుమార్, సహాయ కార్మిక అధికారులు యం.వెంకటేశ్వర్లు, యం.ఎలిజబెత్ తదితరులు పాల్గొన్నారు.

పేదల రేషన్‌లో అక్రమాలు సహించం

● కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్ఓ ఉదయ్‌భాస్కర్



కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కొత్త డీఎస్ఓ ఉదయ్‌భాస్కర్


ఒంగోలు అర్బన్: ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ సరుకుల్లో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి (డీఎస్ఓ) ఏ ఉదయ్‌భాస్కర్ స్పష్టం చేశారు. తిరుపతి డీఎస్ఓగా పనిచేస్తున్న ఉదయ్‌భాస్కర్ ప్రకాశం జిల్లా డీఎస్ఓగా బదిలీ అయి బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్ఓ ఓబులేసులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్ఓ మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామన్నారు. పేదలకు రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడటంతో పాటు రైతుల వద్ద మద్దతు ధరలకు పంట ఉత్పత్తులను కొనుగోలు చేసే విషయంలో తనవంతు కృషి చేస్తానన్నారు.

పేదల గూడుకు ఎందాకైనా..

సీన్ 1: పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు ఒంగోలు నగరంలో శాటిలైట్ టౌన్ షిప్ నిర్మించాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి యోచించారు. నిరుపేదలకు సొంత ఇంటికల నిజం చేయాలన్న సదుద్దేశంతో బాలినేని నగర సమీపంలో ప్రభుత్వ స్థలం అన్వేషించిమరీ లే అవుట్ తయారు చేయించారు. రాష్ట్రంలోనే ఏ జిల్లాలో లేనివిధంగా ఒకేచోట భారీ స్థాయిలో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి వేల సంఖ్యలో పేదలకు ఒకేచోట ఇళ్ల స్థలాలు ఇవ్వవచ్చని భావించి వడివడిగా చదును చేయించారు. యరజర్ల గ్రామంలోని 818 ఎకరాల్లో 24 వేల మందికి ఇళ్లు నిర్మించాలనుకున్నారు.

సీన్ 2: ఇంత మంది పేదలకు ఇళ్లు కట్టిస్తే ప్రభుత్వానికి, బాలినేనికి ఎక్కడ పేరు వస్తుందోనని భావించిన తెలుగుదేశం పార్టీ కుట్రలకు తెరతీసింది. మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కుయుక్తులు పన్నారు. న్యాయపరమైన ఇబ్బందులు సృష్టించి పేదలకు గృహాలను దూరం చేశారు. తన అనుచరుడు మక్కెన శ్రీనివాసరావు చేత హైకోర్టులో కేసు వేయించి స్టే తెచ్చారు. ఫలితంగా నిరుపేదల ఆశపై నీళ్లుజల్లారు.

సీన్ 3: పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం ఎందాకైనా వెళ్లాలని బాలినేని నిర్ణయించారు. పచ్చ కుట్రలను తిప్పికొట్టి నిరుపేదలను ఆదుకోవాలనుకున్నారు. నగర పరిసర ప్రాంతాల్లో 500 ఎకరాల ప్రైవేటు స్థలాన్ని సేకరించాలని రంగం సిద్ధం చేశారు. ఇదే విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుంచారు. సీఎం బాలినేని ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నగరం చుట్టూ ఉన్న ఆరు గ్రామాల్లో స్థలాలు ఎంపిక చేసేపనిలో పడ్డారు.



టీడీపీ నాయకులు కుయుక్తులతో హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్న యరజర్ల వద్ద ఏర్పాటు చేసిన శాటిలైట్ టౌన్‌షిప్ లేఅవుట్

- టీడీపీ కుయుక్తులను తిప్పికొట్టాలని బాలినేని యత్నం
- ఎలాగైనా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకునే దిశగా అడుగులు
- 500 ఎకరాల ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేసైనా పట్టాలు
- సీఎం వైఎస్ జగన్ ఆమోదంతో రూ.200 కోట్లు కేటాయింపు
- ఒంగోలు పరిసర ప్రాంతాల్లో భూములను గుర్తిస్తున్న అధికారులు
- మార్చి ఆఖరుకల్లా పట్టాలు ఇచ్చి తీరుతామంటున్న బాలినేని

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

పేదవారి సొంతింటి కల సాకారం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తలంచారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పెద్ద ఎత్తున గృహాలు నిర్మించేందుకు రంగం సిద్ధం చేశారు. ఒంగోలు నగరంలో పేదలకు ఒకే ప్రాంతంలో ఇళ్లు నిర్మించాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి భావించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక శాటిలైట్ సిటీని కట్టాలని, ఆమేరకు చర్యలు చేపట్టారు. యరజర్ల గ్రామంలోని 818 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. దాదాపు 24 వేల మందికి సొంత ఇంటి కల నిజం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. హద్దురాళ్లు సైతం వేయించారు. పనులు వేగంగా జరుగుతున్న సమయంలో టీడీపీ నేతలు సైంధవుడిలా అడ్డుపడ్డారు. ఇంతమంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే ఇక తన రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ భావించి కుట్రలకు తెరతీశారు. తన ప్రధాన అనుచరుడు అయిన ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మక్కెన శ్రీనివాసరావు చేత హైకోర్టులో కేసు వేయించాడు. దీంతో హైకోర్టు నిరుపేదలకు ఇచ్చే ఇళ్ల పట్టాలను ఇవ్వకుండా నిలుపుదల చేస్తూ స్టే ఆర్డర్ ఇచ్చింది.

మైనింగ్ పేరుతో అడ్డుపుల్ల:

యరజర్ల గ్రామంలోని ప్రస్తుతం ఇళ్లపట్టాలకు ఇవ్వాలని భావించిన స్థలం గతంలో ఐరన్ ఓర్ మైనింగ్‌కు ఇచ్చారంటూ మక్కెన శ్రీనివాసరావు హైకోర్టుకు వెళ్లాడు.

అయితే గతంలో మైనింగ్‌కు ఇచ్చినప్పుడు ఇదే మక్కెన శ్రీనివాసరావు మైనింగ్‌కు ఇవ్వటానికి వీలు లేదని ఆందోళనలు చేశాడు. మైనింగ్ లీజులు రద్దు చేసి ఐఐఐటీకి ఇవ్వాలని కూడా ఆందోళనలు చేపట్టాడు. ఇదంతా మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆడుతున్న కుట్రలో భాగంగానే జరిగిందని అందరూ గుర్తించారు.

> **మార్చి నెలాఖరుకల్లా ఇళ్ల పట్టాలు ఇచ్చి తీరుతాం**
> టీడీపీ నాయకులు ఎన్ని అడ్డంకులు కల్పించినా మార్చి నెలాఖరుకల్లా నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆదుకుంటాం. సీఎం వైఎస్ జగన్‌కు ఇళ్ల పట్టాల విషయం చెప్పాను. కోర్టు అడ్డంకులు ఉన్నందున ప్రైవేటు స్థలాలైనా కొనుగోలు చేసి ఇద్దామని హామీ ఇచ్చారు. దీంతో ఒంగోలు నగర పరిసర గ్రామాల్లో దాదాపు 500 ఎకరాలు కొనుగోలు చేసి ఇవ్వటానికి భూముల గుర్తింపు ప్రారంభించాం. అందుకోసం రూ.200 కోట్లు కేటాయించారు. ఇప్పటికే భూముల గుర్తింపు కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు ప్రారంభించారు.
> – బాలినేని శ్రీనివాస రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే

టీడీపీ కుట్రలకు చెక్

నగరంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించాలని బాలినేని శ్రీనివాస రెడ్డి బలంగా భావించారు. ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించాలన్న ప్రతిపాదనలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుంచారు. దీనికి ఆయన అంగీకరించారు. ఒంగోలు, కొత్తపట్నం మండలాల పరిధిలో 500 ఎకరాలు కేటాయించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. భూములు కొనేందుకు రూ.200 కోట్లు కేటాయించారు.

ఆరు గ్రామాల్లో స్థలాల గుర్తింపు..

ఇళ్ల స్థలాలు ఇవ్వటానికి రెవెన్యూ అధికారులు ఇప్పటికే ఆరు గ్రామాల్లో స్థలాలను గుర్తించారు. మొత్తం దాదాపు 25 వేల మందికి ఇచ్చేలా స్థలాల ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. మల్లేశ్వరపురం, పెళ్లూరు, అగ్రహారం, సర్వేరెడ్డిపాలెం, వెంగముక్కల పాలెం, కరవది గ్రామాల్లో సర్వే నంబర్ల వారీగా స్థలాలను ఇప్పటికే గుర్తించారు. సర్వే నంబర్ల వారీగా అనుభవదారులు, హక్కుదారులను గుర్తించి వారి వద్ద నుంచి కొనుగోలు చేయటానికి రంగం సిద్ధం చేస్తున్నారు. పదిహేను రోజుల్లోపు ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు సన్నాహాలు ముమ్మరం చేశారు.

సంక్షేమానికి ఎంత ఖర్చయినా భరిస్తాం



వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్ కుమార్, పీడీసీసీబీ చైర్మన్ వెంకయ్య

- అర్హత ఉంటే చాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే..
- టీడీపీ వాళ్లు ఎప్పుడైనా ఒక్క ఇంటి పట్టా అయినా ఇచ్చారా ?
- వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాల్లో పింఛన్లు పంపిణీ
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: నిరుపేదల బంగారు భవిష్యత్తు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంత ఖర్చయినా భరిస్తుందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. స్థానిక దక్షిణ బైపాస్‌లోని జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం ఒంగోలు నగర పాలకల సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన బాలినేని మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు నేరుగా ఇంటి ముంగిటకే వచ్చి చేరుతాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా జన్మభూమి కమిటీలు ఏవీ ఇక్కడ అడ్డంకిగా లేవని గుర్తు చేశారు. వృద్ధులకు పింఛను కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఒక వేళ పింఛను వచ్చినా అవి తీసుకోవటానికి పంచాయతీ కార్యాలయానికో, మున్సిపల్ కార్యాలయానికో, ఎంపీడీఓ కార్యాలయానికో వెళ్లి క్యూల్లో వేచి ఉండాల్సి వచ్చిన రోజుల గురించి గుర్తు చేశారు. 24 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టించటానికి పూనుకుంటే అవి ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోర్టుకు వెళ్లి అడ్డుకున్నాడన్నారు. జనార్దన్ ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్నాడని... ఒక్కరికైనా ఒక్క ఇళ్ల పట్టా ఇచ్చాడా అని ప్రశ్నించారు. గతంలో తాను ఒంగోలు నగరంలో వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టుకునేందుకు సహకరించానని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ చెప్పినట్లుగా పింఛన్ల డబ్బులను పెంచుకుంటూ పోతున్నారన్నారు. అందుకే రూ.2500 నుంచి రూ.2750 చేశారన్నారు. పాత పింఛన్లు పెంచటమే కాదు కొత్తగా జిల్లాలో 9656 పింఛన్లు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో ఇంటింటికీ తిరుగుతున్నామని చెప్పారు. వాళ్ల సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడుగుతున్నామని, నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వస్తానన్నారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ అర్హత ఉన్న వారికి ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంపిక చేసి కొత్తగా పింఛన్లు ఇస్తారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు చేసుకుంటూ పోతుంటే ప్రతిపక్ష నాయకులు మాత్రం ఆయనను తీవ్రంగా దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి చేస్తున్న వారిపై నోరు పారేసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు.

కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా కూడా పెన్షన్లు అందించామన్నారు. జిల్లాలో పెన్షన్ పెంపు వల్ల 2,45,165 మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 2,86,075 మందికి రూ.79.41 కోట్లు ఈ నెలలో పెన్షన్ల రూపంలో అందిస్తున్నామన్నారు. 2019 జూన్ నుంచి 2022 డిసెంబర్ వరకు జిల్లాలో రూ.2,977.5 కోట్లను పెన్షన్ల రూపంలో లబ్ధిదారులకు అందించామన్నారు. జగనన్న హౌసింగ్ (అర్బన్) పథకంలో భాగంగా అర్హులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఒంగోలు పరిసర ప్రాంతాల్లో స్థలాలను గుర్తిస్తున్నామన్నారు. మార్చిలో వీటికి పట్టాల పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సదస్సుకు ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పింఛనుదారులకు సీఎం వైఎస్ జగన్ పంపిన సందేశాన్ని చదివి అందరికీ వినిపించారు. ఒంగోలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఒంగోలు నగరంలో నూతనంగా మంజూరైన పింఛన్లు, పెరిగిన పింఛన్ల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఒంగోలు ఎంపీపీ మల్లిఖార్జున రెడ్డి, కార్పొరేటర్లు అంబటి ప్రసాదు, ఈదర సురేష్ బాబు, యనమల నాగరాజు, గిరిజా శంకర శాండిల్యతో పాటు పలువురు ఒంగోలు నగర కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మరా బాబూ..



ప్రజల కోసం పోరాడుతున్నామని చెప్పుకుంటూ ప్రతిపక్ష పార్టీ నాయకులు స్వార్థ రాజకీయాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఒంగోలు–కొత్తపట్నం మార్గంలోని బకింగ్‌హాం కెనాల్ బ్రిడ్జి వద్ద టీడీపీ చేపట్టిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' ధర్నా కార్యక్రమం సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై వాహనాలను అడ్డుకొని నిలిపేయడంతో ట్రాఫిక్ జామ్ అయి ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇదేమార్గంలో వచ్చిన 108 అంబులెన్స్‌కు కూడా దారి ఇవ్వకపోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి అంబులెన్స్‌ను పంపించారు. – కొత్తపట్నం

మార్చి వరకు రికవరీ డ్రైవ్ నిర్వహించాలి

ఒంగోలు: వివిధ సంస్థలు చెల్లించాల్సిన ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిలపై స్పెషల్ డ్రైవ్‌ను మార్చి వరకు కొనసాగించి రికవరీ చేయాలని గుంటూరు రేంజి రీజినల్ పీఎఫ్ కమిషనర్ రాజేశ్వర్ రాజేష్ ఆదేశించారు. ఒంగోలు పీఎఫ్ కార్యాలయానికి బుధవారం వచ్చిన ఆయన తగు సూచనలు ఇచ్చారు. బకాయిల వసూలు కోసం ప్రత్యేక అధికారుల బృందాన్ని కూడా ఒంగోలుకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో వివిధ సంస్థల యజమానులు తక్షణమే వారు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని, లేని పక్షంలో ఉద్యోగుల భవిష్యనిధి చట్టం ప్రకారం ఆయా సంస్థల ఆస్తులను జప్తుచేసి వసూలు చేస్తామన్నారు. ప్రకాశం జిల్లా సమాఖ్య, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులను నియమించి పీఎఫ్ చందా సకాలంలో చెల్లించనందున పెనాల్టీ విధించారు. పెనాల్టీ చెల్లించని కారణంగా ఆ సంస్థ ఆస్తులను, సంబంధిత ప్రభుత్వ శాఖల వారి ఆస్తులను జప్తుచేసి రూ.86,29,974, ఇతర ప్రైవేటు సంస్థల నుంచి రూ.31,94,081 వసూలు చేస్తారన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ కార్యాలయ సహాయ కమిషనర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులకు ప్రోత్సాహం



పదో తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న బాలినేని, వెంకాయమ్మ, కలెక్టర్

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత
- ప్రభుత్వ హాస్టళ్లలోని పదో తరగతి విద్యార్థులకు రూ.10.70 లక్షల విలువైన స్టడీ మెటీరియల్ పంపిణీ

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులను ప్రోత్సహించటం ద్వారా పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. స్థానిక దక్షిణ బైపాస్‌లోని జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ మొత్తం 119 ప్రభుత్వ హాస్టళ్లలోని 2117 మందికి స్టడీ మెటీరియల్ అందిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖలోని 59 వసతి గృహాలకు సంబంధించిన 973 మంది విద్యార్థినీ, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నామన్నారు. వారిలో 606 మంది తెలుగు మీడియం, 367 మంది ఇంగ్లిషు మీడియం విద్యార్థులున్నారన్నారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖలోని 13 వసతి గృహాల్లోని 327 మందికి, 47 బీసీ వసతి గృహాల్లోని 817 మందికి స్టడీ మెటీరియల్ అందించటం మంచి పరిణామమన్నారు. మొత్తం అందుకోసం రూ.10,70,523 వెచ్చించటం ద్వారా పేద పిల్లలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. తెలుగు, ఇంగ్లిషు మీడియం విద్యార్థులకు పుస్తకాలు, పరీక్ష ప్యాడ్, స్కేలు, రెండు బాల్‌పాయింట్ పెన్నులు, రెండు పెన్సిళ్లు, స్కెచ్ పెన్నుల సెట్, జామెంట్రీ బాక్స్‌లు అందించి పరీక్షలు బాగా రాయాలని చిన్నారులను బాలినేని ఆశీర్వదించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ కూడా పిల్లలకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకట రెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎన్.లక్ష్మా నాయక్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎం.అంజలాదేవీ, ఎస్టీ సంక్షేమ జిల్లా అధికారి పి.జగన్నాథరావుతో పాటు ఒంగోలు నగర కార్పొరేటర్లు, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సేవలు పోర్టల్‌లో నమోదు చేయాలి

● డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు అర్బన్: జిల్లాలో మాతృ సేవలు, శిశువులు, పిల్లలకు అందించే వైద్య సేవల వివరాలు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి సూచించారు. నగరంలోని వెంకటేశ్వరకాలనీలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. పోర్టల్ నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. ముఖ్యంగా గర్భిణీ సేవలు, ప్రసూతులు, సమస్యాత్మక గర్భిణులు, వ్యాధి నిరోధక టీకాల వివరాలు తప్పక పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. 108 సేవల వివరాలను వెంటనే నమోదు చేయాలన్నారు. పోర్టల్‌లో నమోదుకు ఏఎన్‌ఎంల ద్వారా డేటా ఎంట్రీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో డాక్టర్ చంద్రికా, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

కొలతల్లో కచ్చితత్వం అవసరం

● డీపీఓ నారాయణరెడ్డి



రీసర్వేపై సమావేశం నిర్వహిస్తున్న డీపీఓ నారాయణరెడ్డి

ఒంగోలు అర్బన్: రీ సర్వేలో భాగంగా గ్రామాల్లో గృహాలు, భూములకు జరిగే సర్వేలో కొలతలు కచ్చితత్వం పాటించాలని డీపీఓ నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. ప్రకాశంభవనంలో రీ సర్వే ప్రక్రియపై బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీపీఓ మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష సర్వే పునః పరిశీలన కార్యక్రమం జిల్లాలో ఇప్పటికే 5 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్ పూర్తయిందన్నారు. సర్వే సమయంలో ఇంటి, భూ యజమానులకు నోటీసులు అందచేసి అభ్యంతరాలు ఉంటే సంబంధిత పంచాయతీల్లో తగిన పత్రాలతో సంప్రదించేలా అవగాహన కల్పించాలన్నారు. రీ సర్వేతో గ్రామ కంఠంలోని గృహాలకు హక్కు పత్రాలు వస్తాయన్నారు. దీనిలో డివిజనల్ పంచాయతీ అధికారులు, విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ సర్వేయర్‌లు పాల్గొన్నారు.

19న ఒంగోలు జాతి పశువుల వేలం

నాగులుప్పలపాడు: పశుసంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చదలవాడ పశు ఉత్పత్తి క్షేత్రంలో ఈ నెల 19న ఒంగోలు జాతి పశువుల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఏడీఏ రవికుమార్ తెలిపారు. ఈ వేలంలో ఒంగోలు జాతి పాడి ఆవులు 5, ఒట్టి ఆవులు 30, ఒంగోలు జాతి పెయ్యలు 9, పెయ్య దూడలు 5, ఒంగోలు జాతి కోడె దూడలు 6.. మొత్తం 55 పశువులను వేలం వేయనున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనే వారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలని స్పష్టం చేశారు. వివరాలకు 9392901049ను సంప్రదించాలని సూచించారు.

బంగారు ఆభరణాలు చోరీ

మార్కాపురం: పట్టణంలోని వడ్డె బజారులో నివాసం ఉంటున్న బొందిలి పెద్ద హనుమాన్ సింగ్ ఇంట్లో ఆరు తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. బాధితుని కథనం మేరకు.. హనుమాన్‌సింగ్ కంభం రోడ్డులో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆయన భార్య ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. మంగళవారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. రాత్రి ఇంటికి వెళ్లిన తర్వాత వెనుక వైపు తలుపు తాళం తెరిచి ఉండటంతోపాటు బీరువాలో ఆరు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని ఎస్సై శశికుమార్ పరిశీలించారు. దర్యాప్తులో భాగంగా సీసీ పుటేజ్‌ను పరిశీలిస్తున్నారు.

కనిగిరిలో..

కనిగిరి రూరల్: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దుండుగలు రూ.24 వేల నగదు అపహరించారు. ఈ సంఘటన బుధవారం కనిగిరిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హెచ్‌ఎంపాడు మండలం మొహ్మదా జడ్పీ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆర్నూరి రాజ్యలక్ష్మి పట్టణంలోని ఆల్ఫా స్కూల్ సమీపంలో దుత్తులూరి వారి వీధిలో నివసిస్తోంది. ఆమె ఉదయాన్నే డ్యూటీకి వెళ్లారు. పక్కనే ఉండే ఇంటి యజమాని మధ్యాహ్నం పూలచెట్లకు నీరు వేసేందుకు అటుగా వెళ్లగా రాజ్యలక్ష్మి ఉండే ఇంటి కిటికీ గ్రీల్స్ తొలగించి ఉండటాన్ని గమనించి రాజ్యలక్ష్మికి సమాచారం అందించారు. ఆమె వచ్చి ఇంటిని పరిశీలించి దొంగలు కిటికీ గ్రీల్స్ తొలగించి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని రూ. 24వేల నగదు అపహరించినట్లు నిర్ధారించింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి ప్రసాద్ తెలిపారు. ఒంగోలు క్లూస్ టీం ఎస్సై పి.శరత్‌కుమార్ బృందం ఆధారాలు సేకరించారు.



చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

అంధులకు అండగా ఉంటాం

● వారి కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తా
● లూయీ బ్రెయిలీ జయంతిలో కలెక్టర్ దినేష్‌కుమార్



బ్రెయిలీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు అర్బన్: అంధులకు అన్నీ విధాలుగా అండగా ఉంటూ వారి అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్పందన భవనంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం లూయిస్ బ్రెయిలీ 214వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరై లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలు పరిష్కారం చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి పరిష్కారం చేస్తామన్నారు. దివ్యాంగులకు గతంలో ఇచ్చిన ఇళ్ల ప్లాట్లను పునఃపరిశీలించి జగనన్న లే అవుట్ ద్వారా అర్హులందిరికీ పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నిబంధనల మేరకు ర్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దివ్యాంగులు వారి ప్రతిభాపాటవాలను ప్రభుత్వ సేవా కార్యక్రమాల్లో వినియోగించాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దివ్యాంగుల సంక్షేమానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అనంతరం బ్రెయిలీ లిపి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పలువురు అంధ విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ చేశారు. అనంతరం చర్చి సెంటర్‌లోని బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, ప్రజా రవాణా కమిషనర్ కృష్ణవేణి, సాంఘీక సంక్షేమ శాఖ ఏడీ లక్ష్మా నాయక్, డీఆర్‌డీఏ పీడీ బాబురావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి జగన్నాథం, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఝాన్సీ ఇతర అధికారులు, అంధ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి దొంగకు అరదండాలు

● ఫిర్యాది భార్య మేనల్లుడే నిందితుడు
● అప్పులవాళ్ల బాధ పడలేక చోరీకి పాల్పడిన వైనం
● వివరాలు వెల్లడించిన ఎస్పీ మలికాగర్గ్



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టుకోలేడు అంటారు.. కానీ నేరం చేసిన వారు ఎవరైనా పట్టుబడక తప్పదని నిరూపించారు ఒంగోలు పోలీసులు. నగరంలోని దేవుడి చెరువులో వరికుంట్ల వెంకట కృష్ణయ్య అనే ఉపాధ్యాయుడి ఇంటిలో దొంగతనానికి పాల్పడిన మార్కాపురానికి చెందిన బట్టు క్రాంతి కిరణ్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.52,60,000ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలను ఎస్పీ మలికాగర్గ్ వెల్లడించారు. కొత్తపట్నంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వెంకటకృష్ణ డిసెంబర్ 31న పాఠశాలకు వెళ్లారు. ఆయన భార్య భ్రమరాంబ అంతకు మూడు రోజుల ముందే మార్కాపురంలోని సోదరుడి ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో వారి నివాసంలో దొంగతనం జరిగింది. ఇంటి వెనక నుంచి లోపలికి ప్రవేశించిన గుర్తు తెలియని దొంగలు కప్ బోర్డులో రెండు బ్యాగుల్లో దాచి ఉంచిన రూ.52 లక్షలకు పైగా నగదు దోచుకెళ్లారు. కేసును సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ మలికాగర్గ్ ఏఎస్పీ (క్రైమ్) శ్రీధరరావు, డీఎస్పీ యు.నాగరాజు పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ, సిబ్బందితో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు.

చోరీ జరిగింది ఇలా..

నిందితుడు క్రాంతి కిరణ్ ఫిర్యాది వెంకటకృష్ణ భార్య భ్రమరాంబకు స్వయాన మేనల్లుడు. గతంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల్లో కాంట్రాక్ట్ పనులు చేశాడు. సమారు 2.70 కోట్ల రుపాయల మేర పనులు చేసిన అతడు అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. అప్పుల బాధ తట్టుకోలేక చోరీకి పాల్పడాలని నిర్ణయించుకున్నాడు. ఇంట్లో ఉన్న డబ్బుతో ఏదైనా స్థలం కొందామనుకుంటున్నామని తన మేనత్త చెబుతుండగా విన్నాడు. ఆ డబ్బును కాజేసేందుకు వెంటనే ఒంగోలుకు చేరుకున్నాడు. చీమకుర్తికి చెందిన స్నేహితుడికి ఫోన్ చేసి ఒక బిల్లు తాలుకు డబ్బు వస్తుందని, తనను కారులో మార్కాపురం వరకు వదిలి రమ్మని కోరాడు. ముందుగా అనుకున్న ప్లాన్ ప్రకారం వెంకటకృష్ణ ఇంటి వద్దకు చేరుకుని గుట్టుచప్పుడు కాకుండా పని ముగించుకుని కారులో దర్జాగా ఉడాయించాడు.

ఎస్పీ అభినందనలు

సంచలనం సృష్టించిన భారీ చోరీ కేసును స్వల్ప వ్యవధిలో ఛేదించడమే కాకుండా అత్యంత చాకచక్యంగా నిందితుడిని అరెస్టు చేసిన ఏఎస్పీ(క్రైమ్) శ్రీధర్‌రావు, డీఎస్పీ యు.నాగరాజు, వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ఎం.మురళి, హెడ్‌కానిస్టేబుళ్లు ఎం.సాయికృష్ణ, జి.విజయ్, ఖాజావలి, కానిస్టేబుళ్లు తిరుపతయ్య, అనిల్‌ను ఎస్పీ మలికాగర్గ్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు.

కటకటాల్లోకి నకిలీ పోలీస్

● ఒంగోలు ఆర్టీసీ డిపో వద్ద నగలు అపహరించిన నిందితుడు
● 351 గ్రాముల బంగారం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: కోయంబత్తూరుకు చెందిన బంగారం వ్యాపారి ఆర్టీ బాలాజీని పోలీసుల పేరుతో బురిడీ కొట్టించి నగలు కాజేసిన గుంతకల్‌కు చెందిన షేక్ హుసేన్‌బాషాను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. నిందితుడి నుంచి రూ.17 లక్షల విలువైన 351 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వివరాలను బుధవారం ఎస్పీ మలికాగర్గ్ మీడియాకు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో విశాల్ జ్యూవెలర్స్ వర్క్ దుకాణం నిర్వహించే ఆర్టీ బాలాజీ ఆర్డర్లు తీసుకుని బంగారం ఆభరణాలు తయారు చేసి ఒంగోలు, చీమకుర్తిలో వ్యాపారులకు అందజేస్తుంటారు. ఎప్పటిలాగే గతేడాది సెప్టెంబర్ 21న నగలు డెలివరీ చేసేందుకు బాలాజీ ఒంగోలు వచ్చారు. గాంధీ రోడ్డులోని పలు దుకాణాల్లో నగలు ఇచ్చి చీమకుర్తి వెళ్లేందుకు ఆటోలో ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. కార్గో పార్సిల్ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వ్యక్తి బాలాజీని ఆపి పోలీసు అధికారిని అని పరిచయం చేసుకున్నాడు. నీ వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారం ఉందని చెప్పి కొద్ది దూరంలో నిల్చుని ఉన్న మరో వ్యక్తి దగ్గరకు తీసుకెళ్లాడు. బ్యాగు తనిఖీ చేస్తున్నట్లు నటించి అందులోని నగలను కాజేసి తిన్నగా అక్కడ నుంచి జారుకున్నారు. డిపోలో ప్లాట్‌ఫాం వద్దకు వెళ్లిన తర్వాత బ్యాగు తెరిచి చూసిన బాలాజీకి అందులోని 460.840 గ్రాముల ఆభరణాలు కనిపించలేదు. తనిఖీ పేరుతో వచ్చిన వ్యక్తులే నగలు కాజేశారని గ్రహించి వెంటనే డిపోలోని ఔట్ పోస్ట్ పోలీసు సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేపట్టారు. విజయవాడలో ఆభరణాలు విక్రయించే ఉద్దేశంతో ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న నిందితుడు హుసేన్ బాషాను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు హుసేన్ బాషా లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడని, మరో ఇద్దరితో కలిసి చోరీకి పాల్పడినట్లు సమాచారం. మిగిలిన ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన పోలీసు అధికారులను ఎస్పీ మలికాగర్గ్ ప్రత్యేకంగా అభినందించారు.

14 నుంచి రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు

నాగులుప్పలపాడు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అమ్మనబ్రోలు గ్రామంలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ రాష్ట్రస్థాయి ఆహ్వాన చెడుగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కాట్రగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలను వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు హాజరవుతారన్నారు. పురుషుల విభాగంలో మొదటి, రెండు, మూడు, నాల్గవ, ఐదవ, ఆరు స్థానాల్లో గెలుపొందిన జట్లకు రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందజేస్తామన్నారు. పోటీల ప్రారంభం సందర్భంగా 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు పల్సర్ బైక్ సాంగ్ ఫేమ్ సింగర్ రమణ బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

8 నుంచి కేఎస్ రాయల్, ఎస్‌వీ ప్రసాద్ స్మారక క్రికెట్ పోటీలు

సీఎస్‌పురం: . సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కేఎస్ రాయల్, ఎస్‌వీ ప్రసాద్ స్మారక రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ఈ నెల 8 నుంచి సీఎస్‌పురంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుడిపాటి నాగేశ్వరరావు, పెరుగు రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.50,1 16, రూ. 30,116, రూ.15,116 ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 7వ తేదీ లోపు రూ.1,000 ప్రవేశ రుసుం చెల్లించి తమ జట్టు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్:8074900029, సెల్:7569905542, సెల్:9848365287 నంబర్లను సంప్రదించాలన్నారు.

స్వేచ్ఛాయుత పరిసరాల్లో విద్యాభ్యసనం

● డీఈఓ విజయభాస్కర్



మాట్లాడుతున్న డీఈఓ విజయభాస్కర్

ఒంగోలు: స్వేచ్ఛాయుత పరిసరాల్లో విద్యాభ్యసనం జరగాలని డీఈఓ బి.విజయభాస్కర్ అన్నారు. స్థానిక డాన్‌బాస్కో స్కూలులో అగస్త్య ఫౌండేషన్, రాష్ట్ర మాధ్యమిక విద్యా పరిశోధన మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని గణిత, సైన్స్ ఉపాధ్యాయులకు బుధవారం నిర్వహించిన మేక్ యువర్ ఓన్ ల్యాబ్ ముగింపు కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యాభ్యసనం ఆనందంగా సాగాలని, అందుకు సంకుచితమైన కట్టుబాట్లు ఉండరాదన్నారు. ఇటువంటి వాతావరణాన్ని తరగతిలో అందించడం కోసం ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా తాము పొందిన నూతన అనుభవాలను స్వీయ అనుభవాలతో జోడించి విభిన్న పరికరాలు, ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకుంటూ బోధన చేయాలని సూచించారు. ఉప విద్యాశాఖాధికారి అనితా రోజ్‌రాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు తగిన ప్రణాళికతో బోధన చేయాలన్నారు. సైన్స్ అధికారి రమేష్ పాల్గొన్నారు. అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందించారు.

13న క్రికెట్ టోర్నమెంట్

పీసీపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని చిరుకూరివారి పల్లిలో ఈ నెల 13న క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 12వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ బహుమతులుగా రూ.10,116, రూ.7,116, రూ.5116, రూ. 3,116 అందజేస్తామన్నారు. ఎంట్రీ ఫీజు రూ. 400, భోజన వసతి కూడా ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు వివరాలకు 7013498157, 8546826708 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉరేసుకొని ఇద్దరు ఆత్మహత్య



వెంకట నరేంద్ర మృతదేహం



శిరీష మృతదేహం

పామూరు: కుటుంబ సమస్యల నేపథ్యంలో వేర్వేరు ప్రాంతాల్లో యువకుడు, మహిళ మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాలు..పట్టణంలోని డీపీపాలెంకు చెందిన సూరబోయిన వెంకట నరేంద్ర (19) మంగళవారం రాత్రి ఎవ్వరూ లేని సమయం చూసి ఇంట్లో రాడ్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నరేంద్ర తండ్రి బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అదేవిధంగా పాలెంలోని మరో ప్రాంతానికి చెందిన ఇండ్ల శిరీష (27) మంగళవారం రాత్రి బాత్‌రూమ్‌లో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి తండ్రి శ్రీను ఇచ్చిన పిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను కనిగిరి వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై సురేష్‌యాదవ్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం

రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బత్తుల



డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం డాక్టర్ బత్తుల ఒంగోలు పార్లమెంట్ వైద్య విభాగం అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవి కేటాయించిన పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డి, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా రీజినల్ కోఆర్డినేటర్లు భూమన కరుణాకర్ రెడ్డి, బీద మస్తాన్ రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బత్తుల నియామకంపై కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక అందుబాటులో ఉంచాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్



గనులశాఖ అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజల అవసరాల మేరకు ఇసుక అందుబాటులో ఉంచి సరఫరా చేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశంభవనంలో బుధవారం జిల్లా శాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం పనిచేయని రీచ్‌లను రద్దు చేసి కొత్త రీచ్‌ల అనుమతి కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల అవసరాలతో పాటు ప్రభుత్వ పనుల కోసం ఇసుక అందుబాటులో ఉంచాలన్నారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా ఎస్‌ఈబీ అధికారులు చ్యలు తీసుకోవాలన్నారు. కొత్త రీచ్‌లను త్వరగా పరిశీలించి వాడుకలోకి తీసుకురావాలన్నారు. కొత్త స్టాక్ పాయింట్‌లు ప్రారంభించి తక్కువ ధరకే పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, గనుల శాఖ, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, పోలీసు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు శాప్ లీగ్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఆదేశాల మేరకు ఫేజ్-2 శాప్ లీగ్ పోటీలకు క్రీడాకారుల సెలక్షన్స్ గురువారం స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా క్రీడా శాఖ చీఫ్ కోచ్ గుంటి రాజరాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 5న కబడ్డీ పురుష క్రీడాకారుల ఎంపిక, 8న ఫుట్‌బాల్, రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక, 10వ తేదీన టంగుటూరు మండలం జమ్ములపాలెం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో షూట్‌బాల్ సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 9121106840ను సంప్రదించాలని సూచించారు.